# అన్నను టార్గెట్ చేసిన కవిత !

బంజారాహిల్స్‌లో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ సంస్థ భవిష్యత్ కార్యచరణతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.




తెలంగాణ బ్యూరో ప్రదీప్ కొమ్ముగూరి, (డైలీ రిపోర్ట్) మే 31 ;

"కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే తెలంగాణ జాగృతిని ఏర్పాటు చేశాం" అని ఆమె తెలిపారు. గతంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ జాగృతి కార్యక్రమాలు చేపట్టినప్పుడు అనేక అవరోధాలు ఎదురయ్యాయని, "తెలంగాణ జాగృతి అంటేనే మిమ్మల్ని తొక్కేస్తారు అని చాలా మంది మేధావులు హెచ్చరించారు. ఆంధ్ర పాలకుల వివక్ష తీవ్రంగా ఉన్నప్పటికీ, వెనకడుగు వేయకుండా ముందుకు సాగాం" అని కవిత వివరించారు. "తెలంగాణ జాతిపిత కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే, అది యావత్ తెలంగాణ ప్రజానీకానికి నోటీసులు ఇచ్చినట్లే" అని ఆమె వ్యాఖ్యానించారు.

నదీ జలాల పంపిణీ విషయంలోనూ కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "గోదావరి-కావేరీ నదుల అనుసంధానంతో తెలంగాణకు రావాల్సిన నీళ్లు శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదం ఉంది. బనకచర్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు? నదుల అనుసంధానాన్ని కేసీఆర్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. తుపాకుల గూడెం వద్ద రివర్ లింకేజీ ఉండాలని ఆయన సూచించారు. కానీ, కేంద్రం ఇచ్చంపల్లి వద్ద రివర్ లింకేజీ పెడతామని చెబుతోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నదీ జలాలపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలి. వెంటనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయాలి" అని కవిత డిమాండ్ చేశారు.

లేఖతో రాజకీయ సంచలనంగా మారిన కవిత వరుస నిర్ణయాలతో దూకుడు పెంచారు. తన తండ్రి కేసీఆర్.. బీఆర్ఎస్ ను కాపాడుకోవటం తన లక్ష్యమని చెబుతున్న కవిత రాజకీయ అడుగులు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కవిత లేఖ తరువాత కేసీఆర్ పార్టీ ముఖ్య నేతలతో మంత్రాంగం సాగించారు. కవిత వ్యవహారంలో వేచి చూసే ధోరణితో కనిపిస్తున్నారు. అటు ఈ వ్యవహారంలో కేటీఆర్ లక్ష్యంగా కవిత అడుగులు స్పష్టంగా ఉన్నాయి. కేటీఆర్ వ్యూహాత్మకంగానే ఈ సమయం లో విదేశీ పర్యటనకు వెళ్లారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ట్వీట్లకే పరిమితం అవుతారా అంటూ తన అన్న ను టార్గెట్ చేసిన కవిత.. కేసీఆర్ కు నోటీసులు ఇస్తే ఆందోళనలు చేయరా అంటూ నిల దీసారు. ఇప్పుడు తానే ఆ పనికి సిద్దమయ్యారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత విమర్శలు గుప్పించారు. "గత పదేళ్ల కేసీఆర్ పాలనకు, ఇప్పటి కాంగ్రెస్ పాలనకు చాలా తేడా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం జూన్ 2న జరగబోయే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా ఆయన 'జై తెలంగాణ' నినాదం చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం పేరుపైనా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. "జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు? రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం? తెలంగాణ యువ వికాసం అని పేరు పెట్టాలి" అని ఆమె వ్యాఖ్యానించారు.

